ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 30 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# రూ.1000కోట్లు దారి మళ్లింపు?

## కేంద్ర ప్రభుత్వం నిధులు ఎక్కడికి పోతున్నాయి?: ఎంపీ రఘునందన్

హైదరాబాద్, ప్రజాస్వరం: గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్ల నిధులు విడుదల చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. మిగిలిన రూ.1000 కోట్ల నిధులను రేవంత్‌రెడ్డి సర్కారు ఇతర కార్యకలాపాలకు దారి మళ్లించిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందన్న రఘునందన్.. పల్లె ప్రగతికి నిధులు విచ్చిందడం లేదని దుయ్యబట్టారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా శానిటైజేషన్ కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు.



## మెదక్ జిల్లాలో

# ఘోర రోడ్డు ప్రమాదం

### ఇనుప మెట్లను ఢీకొన్న బైకిస్ట్, ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

**మెదక్, ప్రజాస్వరం :** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇనుప మెట్లను బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్ద శంకరంపేట్ మండలం మల్కాపూర్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇనుప మెట్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు రేగోడ్ మండలం పెద్దతండాకు చెందిన మెగావత్ర మేష్(46)గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# డెడికేటెడ్ కమిషన్

## రెండు వారాల్లోగా ఏర్పాటుకు చేయాల్సిందే

### బీసీ రిజర్వేషన్ల కోసమే - రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ప్రజాస్వరం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఆ మేరకు రెండు వారాల్లోపు ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ బాధ్యతలు బీసీ కమిషన్కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలని బీసీ సంఘాలు సహా, పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు కీలకంగా మారాయి.



## భారాస నేతల పని

# విమర్శించడమే

### మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: తెలంగాణలో కులగణన ప్రక్రియను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. భారాస నేతలు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన కులాలకు చెందిన వారిపై భారాసకు ప్రేమలేదన్నారు. తెలంగాణ బీసీసీ చీఫ్‌గా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ నియమించిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తూ.. అనవసర రాద్ధాంతం చేస్తునారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు.



## స్టార్ క్యాంపెయినర్ జాబితాలో

# సీఎం రేవంత్

హైదరాబాద్, ప్రజాస్వరం : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు ఉంది. నవంబర్‌లో మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఒకే దఫాలో జరుగుతుండగా, ఝార్ఖండ్ ఎన్నికలు రెండు దఫాల్లో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది. మహారాష్ట్ర ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్లు ఉన్నాయి. జాబితాలో కేసీ వేణుగోపాల్, అశోక్ గెహ్లాట్, ముకుల్ వాస్నిక్, డీకే శివకుమార్, సచిన్ పైలట్, రణ్‌దీప్ సుర్జేవాలా, జి పరమేశ్వర, ఎంబీ పాటిల్, కన్హయ కుమార్, అల్కా లాంబా తదితరులు ఉన్నారు.

# సంగారెడ్డిలో ప్రొటోకాల్ వివాదం

### బీసీ కమిషన్ సభ్యుల ఆహ్వానానికి కలెక్టర్ క్రాంతి గైర్హాజరు

### స్వాగతం పలికిన అదనపు కలెక్టర్, ఆర్డీఓ

### చైర్మన్ వస్తే ఆహ్వానించరా? : నిరంజన్ ఆగ్రహం

### సమావేశానికి కలెక్టర్ హాజరై జ్ఞాపిక ఇవ్వగా తిరస్కరణ



**సంగారెడ్డి, ప్రజాస్వరం :** బీసీ కమిషన్ పర్యటన నేపథ్యంలో ప్రొటోకల్ వివాదం చోటుచేసుకుంది. సంగారెడ్డిలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దీనికి గాను బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ రాగా స్వాగతం పలికే సమయంలో కలెక్టర్ క్రాంతి గైర్హాజరయ్యారు. దీంతో వివాదం రాజుకుంది. అయితే అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఆ మేరకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కలెక్టర్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కమిషన్ చైర్మన్ వస్తే ఆహ్వానించడానికి రారా అంటూ మండిపడ్డారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ క్రాంతి హాజరయ్యారు. బీసీ కమిషన్ చైర్మన్ కి జ్ఞాపిక ఇవ్వగా బీసీ కమిషన్ చైర్మన్ తిరస్కరించారు.

## నటుడు దర్శన్

# జైలు నుంచి విడుదల

**బెంగళూరు :** కన్నడ నటుడు దర్శన్ జైలు నుంచి బయటకు వచ్చారు. నటుడి ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని ఆరు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ఈ మేరకు బుధవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు తీర్పుతో తాజాగా అతను జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన భార్య విజయలక్ష్మి స్వయంగా జైలు వద్దకు వెళ్లారు. కోర్టు తీర్పుతో దాదాపు నాలుగు నెలల తర్వాత ఆయన జైలునుంచి విడుదలయ్యారు. కాగా రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్‌తోపాటు నటి పవిత్రగౌడ సహా 16మందిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# దివ్యాంగుల కన్నెర

### కలెక్టరేట్ ఎదుట ధర్నా

### ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్

**జగిత్యాల, ప్రజాస్వరం :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని దివ్యాంగులు సైతం ధర్నాకు దిగారు. రూ. 6,000 పెన్షన్ ఇవ్వాలని, ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఒకరి తోడు లేకుండా జీవనం గడిపే తమకు ప్రభుత్వం పెన్షన్ పెంచి ఆదుకోవాలన్నారు. చాలీచాలని పెన్షన్‌తో అనేక కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు



# తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న సీఎం కుటుంబీకులు

**తిరుమల, ప్రజాస్వరం :** తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి సతీమణి గీత, కుమార్తె, అల్లుడు, మనవడు, తదితరులు శ్రీవారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికి తగిన ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత గర్భాలయంలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం పూజారులు ఆశీర్వచనం చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు వారికి అందజేశారు.

# చైనాకు యాపిల్ షాక్

### ఐఫోన్ 17 ముందస్తు తయారీ భారత్‌లోనే!

**ప్రపంచం : కొవిడ్ సమయంలో ఎదురైన చేదు అనుభవంతో చైనా నుంచి ఐఫోన్ల తయారీని ఇతర దేశాలకు తరలించిన యాపిల్.. తాజాగా ఆ దేశానికి మరో ఝలక్ ఇచ్చింది. యాపిల్ 17 (iPhone) ముందస్తు తయారీని తొలిసారి భారత్‌లో చేపడుతోంది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియను చైనాలో మాత్రమే నిర్వహించిన యాపిల్ సంస్థ.. తొలిసారి డ్రాగన్ దేశానికి వెలుపల చేపడుతుండడం గమనార్హం. కొన్నేళ్లుగా వివిధ ఐఫోన్ మోడళ్లు భారత్‌లో తయారవుతున్నాయి. ఇక్కడి నుంచి భారీ సంఖ్యలో ఇతర దేశాలకూ యాపిల్ వీటిని ఎగుమతి చేస్తోంది. సాధారణంగా ఒక ప్రొడక్ట్ విడుదలైన తర్వాత ఇక్కడ తయారీ చేపడుతుంటారు. కానీ, అమెరికాలో యాపిల్ పార్క్‌లో తదుపరి తరం మొబైల్ డిజైన్ రూపు దిద్దుకున్నాక.. కమర్షియల్ లాంచ్‌కు ముందు ఫోన్లను మాత్రం చైనాలోనే ఇన్నాళ్లూ యాపిల్ చేపడుతూ వస్తోంది. అంటే పూర్తి స్థాయి తయారీకి ముందు ఉన్న ఫోన్లన్నీ చైనాలో రూపొందినవే అన్నమాట. అక్టోబర్ నుంచి మే నెల మధ్యలో సాధారణంగా ఈ ప్రక్రియ జరుగుతుంటుంది.**



కానీ, తొలిసారి యాపిల్ తన మనసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. యాపిల్ 17 విషయంలో ముందస్తు తయారీని భారత్‌లోని ఓ ప్లాంట్‌లో చేపడుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇలా రూపొందిన ఫోన్‌ను 2025 రెండో అర్ధభాగంలో యాపిల్ సాధారణంగా విడుదల చేయనుంది. ముఖ్యంగా కరోనా సమయంలో యాపిల్‌కు ఎదురైన చేదు అనుభవం దృష్ట్యా యాపిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో ఫాక్స్‌కాన్ ప్లాంట్ మూతపడి, ఉత్పత్తి నిలిచిపోవడంతో యాపిల్ తన ఐఫోన్ల ఉత్పత్తిని చైనా వెలుపల చేపట్టాలని నిర్ణయించింది. అలా భారత్‌లోకి ఎంట్రీ ఇచ్చిన యాపిల్.. తొలుత బేస్ మోడళ్ల తయారీ మాత్రమే చేపట్టింది. ఇటీవల విడుదలైన యాపిల్ 16 ప్రో మోడళ్లను సైతం ఇక్కడే చేపడుతున్నట్లు తెలుస్తోంది.

## హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి

# రూ. 82 కోట్లు




హుస్నాబాద్, ప్రజాస్వరం : ప్రభుత్వ ఆస్పత్రికి రూ.82 కోట్లు విడుదల చేసింది ప్రభుత్వం. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 100 పడకల ఆస్పత్రిని 250 పడకల హాస్పిటల్ గా మార్చడానికి నిధులను విడుదల చేసింది. ఆ మేరకు రాష్ట్ర హెల్త్ మెడికల్ ఫామిలీ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ నిధులు విడుదల చేస్తూ అనుమతులను జారీచేసింది. మరోవైపు ఆస్పత్రి పడకలుపెంచడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ట్రూడోకు ఝలక్

### మిత్రపక్షం నుంచే వ్యతిరేకత

### ప్రతిపక్షంతో చేతులు కలిపిన క్యూబెక్ పార్టీ మద్దతు ఉపసంహరణ



**ప్రపంచం:** కెనడాలో పార్లమెంటరీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. మరోసారి అధికారం చేజిక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్న ప్రధాని జస్టిన్ ట్రూడోకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సంకీర్ణ ప్రభుత్వంలోని మిత్రపక్షం నుంచి ట్రూడోకు వ్యతిరేకత ఎదురైంది. తాజాగా క్యూబెక్ పార్టీ ప్రతిపక్షంతో చేతులు కలిపింది. దేశంలోని వృద్ధుల భద్రత కోసం తాము చేసిన సూచనలను ప్రభుత్వం పెడచెవిన పెట్టినట్లు క్యూబెక్ పార్టీ ఆరోపించింది. దీంతో ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకున్నట్లు వెల్లడించింది. ప్రజాభివృద్ధి కోసం ప్రతిపక్షాలతో చేతులు కలిపినట్లు తెలిపింది. ''వృద్ధుల భద్రత కోసం వారికి చెల్లింపులను పెంచాలనే డిమాండ్‌ను ట్రూడో ప్రభుత్వానికి ప్రతిపాదించాం. దానికి డెడ్‌లైన్ కూడా విధించాం. కానీ, దాన్ని నెరవేర్చడంలో విఫలమైంది'' అంటూ క్యూబెక్ పార్టీ నేత ఒకరు పేర్కొన్నారు. కాగా.. కెనడా పార్లమెంట్‌లో 338 స్థానాలు ఉండగా.. ట్రూడో లిబరల్ పార్టీకి 153 మంది సభ్యులు ఉన్నారు. ప్రధాని మిత్రపక్షాల మద్దతుతో ఇన్నాళ్లు ప్రభుత్వాన్ని నెట్టుకొచ్చారు. అయితే.. ఆయన తీరుపై స్వపక్షంలోనే అసంతృప్తి భగ్గుమంది. ట్రూడో రాజీనామా చేయాలంటూ 24 మంది లిబరల్ సభ్యులు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మైనార్టీలో ఉన్న ప్రభుత్వానికి ఇది మరింత సవాలుగా మారింది. వచ్చే ఎన్నికలకు చేసే సన్నాహాలు కూడా దారుణంగా ఉన్నాయని ఎంపీలు అభిప్రాయపడ్డారు.